క్లుప్తంగా

పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో నేదురుమల్లి



సమావేశంలో పాల్గొన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేక భేటీ అయి వెంకటగిరి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు.

విద్యార్థులు ఎన్‌సీసీలో రాణించాలి

కోట : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం కలుగుతాయని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ నావల్ యూనిట్ వార్షిక శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు దిశానిర్దేశం చేశారు. ఇక్కడ ఆరు జిల్లాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లకు లైవ్ ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ గణేష్‌గొడంగవే, సబ్ లెఫ్టినెంట్ మల్లికార్జునరెడ్డి, ఏఎన్‌వోలు నాగరాజు, పెంచలయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పీజీ ఈసెట్‌లో విద్యార్థి ప్రతిభ



నరేంద్రనాథ్‌రెడ్డి

కలువాయి(సైదాపురం): కలువాయికి చెందిన చల్లా నరేంద్రనాథ్ రెడ్డి ఏపీ పీజీ ఈసెట్‌లో ప్రతిభ చూపాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీ ఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరీక్ష రాశాడు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించాడు. నరేంద్రనాథ్‌రెడ్డి ప్రస్తుతం అనంతపురంలోని జేఎన్‌టీయూలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు.

సమావేశానికి అధికారుల డుమ్మా

తడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు, ఆర్టీసీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు, హాస్టల్ వార్డన్లు హాజరుకాకపోవడంపై ఎంపీడీవో శేఖర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, వైస్ ఎంపీపీ కే వెంకటేష్, ఎంఈవో మల్లికార్జునరావు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్

వెంకటగిరి రూరల్/పెళ్లకూరు : జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్‌పార్సల్ మ్యాప్)ను సబ్ డివిజన్ చేసుకోవడానికి 30వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు వెంకటగిరి మండల సర్వేయర్ సుప్రజ, పెళ్లకూరు డీటీ యువరాజ్ తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ భూమి రీసర్వే చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం నంబర్ వల్ల తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలకు అర్హత కోల్పోతున్నారని తెలిపారు. ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు ఎల్‌పీఎంను వ్యక్తిగతంగా సబ్ డివిజన్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. రైతులు సచివాలయంలో రూ.50 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేటకు సమస్యల వెల్లువ

సూళ్లూరుపేట : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం ఇందిరానగర్‌లో గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలు వివరించారు. అనేక ఏళ్లుగా ఇక్కడ నివాసం వుంటున్నా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని వాపోయారు. కాలువలు నిర్మించాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలని, కోరారు. వీధి దీపాలు వెలగడం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇంటి పట్టాలు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



నగదు అందుకుంటున్న విద్యార్థిని

తడ: తడ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సమితి సభ్యుడు మన్నే మద్దు చంద్రబాబు నగదు బహుమతి అందజేశారు. తడకు చెందిన 14 మంది, వాటంబేడుకు చెందిన ఒకరు, చిన్నమాంబట్టుకు చెందిన ముగ్గురు, మోడల్ స్కూల్ విద్యార్థులు నలుగురు మొత్తం 22 మంది 500 మార్కులకు పైగా సాధించారు. వీరిలో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినికి రూ.5,116, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.4,116, రూ.3,116, మిగిలిన వారికి రూ.1,116ల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సురేష్, హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయమైన గుండవోలు జంక్షన్ వద్దనున్న మలుపు



వెలుగోను వద్ద ఉన్న మలుపు



సైదాదుపల్లి వద్ద ఉన్న మలుపు



ప్రమాదకర మలుపులు



సైదాదుపల్లి మలుపు వద్ద మే 8న బోల్తాపడిన లారీ

- ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు
- మలుపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



గుండవోలు మలుపు వద్ద ఊడిపోయిన రైలింగ్

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు వెళ్లే రహదారిలో ఉన్న మలుపుల్లో నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాపూరు –పెంచలకోన సమీపంలోని కలువాయికి వెళ్లే రోడ్డు నుంచి చిత్తూరు జిల్లా ఏర్పేడు రైల్వే గేట్ వరకు నిర్మించిన 565 నంబరు నాలుగు లేన్ల జాతీయ రహదారిలో పలుచోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా రాపూరు సమీపంలోని మద్దెలమడుగు జంక్షన్, రాపూరు తిక్కన పార్కు, సైదాదుపల్లి, వెలుగోను జంక్షన్, గుండవోలు జంక్షన్ సమీపంలోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. 2017 ఆగస్టు 25న పెళ్లి బృందంతో వెళుతున్న జీపు గుండవోలు మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురు మృతి చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ద్విచక్ర వాహనదారులు గాయపడి కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. వందలాది వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. మూగజీవాలు నిత్యం మృతి చెందుతూనే ఉన్నాయి.



ప్రమాదంలో గాయపడిన యువకుడు (ఫైల్)

కనిపించని సూచిక బోర్డులు

రాపూరు –పెంచలకోన రోడ్డులో వున్న మలుపుల్లో వేగ నియంత్రణతోపాటు సూచిక బోర్డులు లేవు. దీంతో వేగంగా వచ్చే వాహనాల డ్రైవర్లు మలుపులను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు లేవు



రాపూరు–పెంచలకోన రోడ్డులో వున్న ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలి. ఈ రోడ్డులోని మలుపుల్లో ప్రతి రోజూ రాత్రిళ్లు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎంతోమంది క్షతగాత్రులుగా మారారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– గోపాల్‌రెడ్డి, ఏపూరు

మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు పెట్టాలి



మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెద్ద పెద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలి. వాహనాల వేగాన్ని తగ్గించేలా చూడాలి. మలుపుల్లో ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. నేషనల్ హైవే అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– దేగా వెంకటనరసారెడ్డి, ఆకలివలస

త్వరితగతిన భూముల సర్వే

ఓజిలి: మండలంలోని రైతుల భూముల సర్వేను త్వరిగతిన పూర్తి చేయాలని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అరుణ్‌కుమార్ ఆదేశించారు. ఆయన బుధవా రం ఓజిలి రెవెన్యూ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు సర్వేలకు చలానా కట్టిన వెంటనే భూముల కొలతలు తీయాలన్నారు. ఈ నెలాఖరులోపు సర్వేలను పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. డీటీ మధుసూదన్‌రాజు, సర్వేయర్లు హరోహర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి కలువాయి విద్యార్థులు



కలువాయి(సైదాపురం): కలువాయిలోని బీవీఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కె.హర్షిత, సీహెచ్ సంతోష్, వేరుబొట్లపల్లి స్కూల్ విద్యార్థిని పి.ప్రణవి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈవోలు రేణుక, శేషగిరిరావు తెలిపారు. వారు బుధవారం వారిని అభినందించారు. ఎంఈవో శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. హెచ్ఎం అబ్బాస్‌అలీ, టీచర్లు వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, పెంచలపుల్లయ్య పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కోట: మండలంలోని గూడలిలోని కొండమిట్ట గిరిజన కాలనీలో బుధవారం పూరిల్లు దగ్ధమైంది. వి.రవికి చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కోట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

రైతులకు పంటలపై అవగాహన

దొరవారిసత్రం/రాపూరు/సైదాపురం:దొరవారిసత్రం, రాపూరు, సైదాపురం మండలాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దొరవారిసత్రంలో పశువైద్యాధికారిణి శ్రీదేవి గ్రామాల్లోని పశువులు, దూడలకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేశారు. ఏవో జ్యోతిర్మయి సాగులో ఉన్న వరి పంటకు సోకిన మోముపిప్పి, మైట్స్ సోకినట్టు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రాపూరులో ఏవో సోమ సుందర్ అధికంగా యూరియా వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సైదాపురం ఏవో హైమావతి వరిలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు.

పీర్ల చావడి స్థలం ఆక్రమణకు యత్నం



నాయుడుపేటలో వున్న చిన్న పీర్లచావడి స్థలం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణ నడిబొడ్డున జామియా మసీదు సమీపంలో ఉన్న చిన్న పీర్ల చావడి స్థలాన్ని నెల్లూరు ప్రాంతానికి చెందిన కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. బుధవారం ప్రైవేటు సర్వేయర్లను తీసుకువచ్చి కొలతలు వేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. బజారువీధి సమీపంలో ఉన్న పీర్ల చావడికి చెందిన స్థలం సుమారు 200 అంకణాలకు పైగా వుంది. ఇక్కడ చిన్నపాటి రేకుల షెడ్డులో వుంది. ప్రభుత్వ రికార్డుల్లోనూ ఇది ప్రభుత్వ స్థలంగా వుంది. ప్రస్తుతం ఇక్కడ అంకణం రూ.లక్షలు విలువ చేస్తోంది. ఈ క్రమంలో దీనిపై కన్నేసిన నెల్లూరు ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఆక్రమించుకునేందుకు సిద్ధమయ్యారు. గమనించిన స్థానికులు ఆక్రమణదారులను అడ్డుకున్నారు. కొలతలు వేస్తున్న వారి ఫొటోలు తీస్తున్న సాక్షి విలేకరిపై నెల్లూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి దాడి చేయడానికి ప్రయత్నించాడు. పరుష పదజాలంతో దూషణకు దిగాడు. అతన్ని స్థానికులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

పారా క్రీడాకారుల ప్రోత్సాహానికే స్పోర్ట్స్ చైతన్య యాత్ర



పారా స్పోర్ట్స్ చైతన్య యాత్రకు స్వాగతం పలుకుతున్న క్రీడాకారులు

చిల్లకూరు : పారా క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్టు గూడూరు పట్టణానికి చెందిన పారా క్రీడాకారుడు పురుషోత్తమ చౌదరి తెలిపారు. తిరుపతి నుంచి బయలుదేరిన స్పోర్ట్స్ చైతన్య యాత్ర బుధవారం గూడూరు చేరుకుంది. ఆయన పోటుపాళెం సర్కిల్ ప్రాంతంలో వారికి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ పారా క్రీడాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కానగుంట కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పారా క్రీడాకారులు రామస్వామి, శ్రీనివాసగౌడ్, మాల్యాద్రి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంవిధాన్ హత్యా దివస్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సంవిధాన్ హత్యా దివస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమ పరిపాలన విధానానికి మన రాజ్యాంగం పెద్దపీట వేసిందన్నారు. 1975లో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి ప్రజల హక్కులను హరించిందన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కె.రవిరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ మహేష్ మాట్లాడుతూ జాతీయ అత్యవసర పరిస్థితి ఏర్పడేందుకు గల కారణాలు, దానివల్ల కలిగిన పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.నారాయణరాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ బి.పీర్‌కుమార్, శ్రీధర్ శర్మ, కిరణ్మయి, కోటేశ్వరరావు, శైలజ,లక్ష్మి, కృపాకరుణ వాణి, హిమబిందు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటం



నిరసన తెలుపుతున్న తొణుకుమాల గ్రామస్తులు

చిల్లకూరు : గ్రామం నుంచి పాఠశాలకు వెళ్లేందుకు అర కిలోమీటర్ దూరం వెళితే సరిపోతుందని, సాగరమాల రోడ్డు వల్ల మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోందని తొణుకుమాల గ్రామస్తులు తెలిపారు. వారు బుధవారం సాగరమాల రోడ్డు పనులను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ తొణుకుమాల గ్రామం సమీపంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. తిక్కవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించడం ద్వారా పిల్లలతోపాటు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని వివరించారు. అండర్ బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్

గూడూరు రూరల్ : గూడూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్ తెలిపారు. వారు బుధవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని అశోక్‌నగర్ సమీపంలో ఉన్న అండర్ బ్రిడ్జి వద్ద వన్ వే అమలు చేస్తున్నామని తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. రెండో అండర్ బ్రిడ్జి నుంచి టూటౌన్‌కు రాకపోకలు సాగించవచ్చన్నారు. చెన్నూ రు, గాంధీనగర్ నుంచి వాహనాలు మినీ బైపాస్ రోడ్డు మీదుగా రెండో అండర్ బ్రిడ్జి ద్వారా ఒకటో పట్టణంలోకి వస్తాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సర్టిఫికెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ కార్యవర్గం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని శేష సాయి కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. విజయవాడకు చెందిన మాజీ లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ అంబటి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. నూతన అధ్యక్షురాలిగా లలిత, కార్యదర్శిగా అరుణకుమారి, కోశాధికారిగా జానకి, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, జీఎస్‌టీ కోఆర్డినేటర్ మంత్రి జగన్నాథరావు, ఆర్‌వీ రావు మధుసూదన్‌రెడ్డి, రాధాకృష్ణారావు, అప్పారావు, గోపాలకృష్ణ, విరూపాక్షరెడ్డి, శ్రీరంజనీ, కృష్ణమూర్తి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మా బడి మాకు కావాలి

- విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన
- పట్టించుకోని అధికారులు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, కేవీపీఎస్ నాయకులు

గూడూరు రూరల్ : గూడూరు మండలం నెర్నూరులోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న 6, 7, 8 తరగతులను రద్దు చేయడం దారుణమని తల్లిదండ్రులు వాపోయారు. మా బడి మాకు కావాలని పిల్లలు డిమాండ్ చేశారు. వారు బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇక్కడ 47 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారిని ఆరు కిలోమీటర్ల దూరంలోని తిరువెంగళాయపల్లి పాఠశాలకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. అంతదూరం తమ పిల్లలు వెళ్లి చదువుకోలేరని తెలిపారు. అందుకే తమ పిల్లలను బడి మాన్పించినట్టు తెలిపారు. జూన్ 12న పాఠశాల ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా పిల్లల గురించి అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తమ గ్రామంలోనే పిల్లలు చదువుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ దాసరి మోహన్, కేవీపీఎస్ నాయకులు అడపాల ప్రసాద్, బీవీ.రమణయ్య, పామంజి మణి, ఆర్.శ్రీనివాసులు, ఎంబేటి చంద్రయ్య, కె.ధనమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవమ్మ, రమేష్, మల్లికార్జున, దాసరి శీనయ్య, పల్లం రాజు, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

బాధితురాలికి నగదు అందజేత



బ్యాంకు ఎదుట మహిళ

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కూల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన నిప్పట్లపల్లి లక్ష్మికి బ్యాంకు అధికారులు బుధవారం తల్లికి వందనం పథకం నగదును పూర్తిస్థాయిలో అందజేశారు. మండలంలోని కూల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన నిప్పట్లపల్లి లక్ష్మికి తల్లికి వందనం నగదు రూ.13 వేలు జమ చేసింది. ఆమె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లింది. తన అత్త పాదుపు రుణం ఉందని చెప్పి డబ్బు తీసుకునేందుకు మేనేజర్ అంగీకరించలేదు. ఆమె బ్యాంకు ఎదుట బోరున విలపిస్తుండడంతో స్థానికులు మేనేజర్‌ను నిలదీయడంతో రూ.7 వేలు ఇచ్చి పంపేశారు. దీనిపై ఈ నెల 21న తల్లికి వందనం ఇవ్వం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి బ్రాంచ్ మేనేజర్‌కు చివాట్లు పెట్టారు. బాధితురాలు లక్ష్మిని బ్యాంకుకు పిలిపించి నగదు అందజేశారు. తనకు తల్లికి వందనం నగదు వచ్చేలా చేసిన సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపింది.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల నిరసన

కలువాయి(సైదాపురం)/రాపూరు: కలువాయి, రాపూరు మండలాల్లోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు డిమాండ్లతో కూడిన నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ తాము సొంత మండలాల్లో పనిచేయకూడదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. డీఎస్సీ ద్వారా నియమితులైన ఇంజినీర్లు తమ సొంత మండలాల్లో చేరుతున్నారని తెలిపారు. వారికి లేని నిబంధన తమకు పెట్టడం తగదన్నారు. తద్వారా తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. తమకు స్పష్టమైన జాబ్‌కార్డు ఇచ్చి ఆ తర్వాత బదిలీల ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు. గురువారం నుంచి జిల్లా స్థాయి అధికారులకు నోటీసులు అందజేస్తామన్నారు. 26న ప్రభుత్వ అధికారిక వాట్సాప్‌ల నుంచి బయటికి వెళ్లిపోతామని, 27న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని వెల్లడించారు. 28 నుంచి నిరాహార దీక్షలు చేపడతామని వివరించారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను అభివృద్ధి చేయాలి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ప్రజలకు తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను అభివృద్ధి చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. ఆయన బుధవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి హయాంలో 15 ఏళ్ల క్రితం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నిర్మించినట్టు గుర్తుచేశారు. అప్పటి నుంచి మోటార్లకు మరమ్మతులు చేయడం తప్ప ఎలాంటి అభివృద్ధీ చేయలేదని ఆరోపించారు. మోటార్లు ఉన్న చోట ఒక అడుగు మేర నీరు నిల్వ ఉందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని తెలిపారు.

జగన్‌పై అక్రమ కేసులు దారుణం

చిల్లకూరు : సత్తెనపల్లి నియోజకవర్గంలో సింగయ్య మృతి విషయంలో మాజీ సీఎం వైఎస్.జగన్‌పై అక్రమంగా కేసు నమోదు చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి విమర్శించారు. ఆయన బుధవారం చిట్టమూరులో విలేకరులతో మాట్లాడారు. వైఎస్.జగన్ పర్యటనలో సింగయ్య అనే వృద్ధుడు గాయాలతో రోడ్డు పక్కనే ఉండగా అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ విషయాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ వెల్లడించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తూ ఈ కేసులో జగన్‌ను ఏ–2గా చేర్చడం దారుణమన్నారు. జగన్‌కు వచ్చిన ప్రజాదరణను చూసి ఓర్వలేని కూటమి ప్రభుత్వ పెద్దలకు గుండెల్లో గుబులుపుట్టి ఇలా అక్రమ కేసులు బనాయించేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వైఎస్.జగన్‌కు రక్షణ కల్పించడంలో విఫలమైందని తెలిపారు. కేంద్రం స్పందించి జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

గూడూరు రూరల్ : గ్రామాల అభివృద్ధికి ఆయా పంచాయతీల మహిళా సర్పంచులు కృషి చేయాలని ఎస్ఐఆర్‌డీ స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ కోరారు. గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారత– గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అన్న అంశంపై మూడు రోజులపాటు మహిళా సర్పంచులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో డీఎల్‌డీవో వాణిరెడ్డి, గూడూరు ఎంపీడీవో మధుసూదనరావు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఎంవోటీ ఎంపీడీవో బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పదవులు

నెల్లూరు(స్టోన్ హౌస్ పేట): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాకు చెందిన నాయకులకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పదవులు ఇచ్చినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం తెలిపింది. రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ జనరల్ సెక్రటరీగా దువ్వూరు మధుసూదన్‌రెడ్డి (గూడూరు నియోజకవర్గం), కార్యదర్శులుగా పూనూరు మనోహర్‌రెడ్డి (ఆత్మకూరు నియోజకవర్గం), ముమ్మారెడ్డి రవీంద్రరెడ్డి (సూళ్లూరుపేట నియోజకవర్గం), పి.సదానందరెడ్డి (వెంకటగిరి నియోజకవర్గం), రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధిగా ఎండీ మగ్దుమ్ మొహిద్దీన్ (గూడూరు నియోజకవర్గం) నియమితులయ్యారు.

మత్స్యకార సొసైటీల బలోపేతానికి కృషి

చిల్లకూరు : మండలంలోని ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీల బలోపేతానికి కృషి చేస్తానని చిల్లకూరు ఎఫ్‌డీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో చిల్లకూరు, కడివేడు మత్స్యకార సొసైటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సభ్యులకు ప్రభుత్వం నుంచి రాయితీలు అందించేలా చూస్తానని వెల్లడించారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకార సొసైటీ సభ్యులకు ప్రభుత్వం పింఛను ఇవ్వనుందని వివరించారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లిలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అలిమిలి సమీపంలోని కనురాయి కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రూ.6 లక్షలు, షణ్ముగ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో రూ.3 లక్షలతో అభివృద్ధి చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, వాన పార్వతి, ఎంపీడీవో వినీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం

చిల్లకూరు : ఉపాధి హామీ పనులను వేగ వంతం చేయాలని ఏపీడీ వరప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం ఏపీవో గిరి కలిసి ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా కంపోస్టు పిట్లు చేపడుతున్నామని తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు.